
సాక్షి
బాపట్ల
శనివారం, 10, ఆగస్టు, 2024



మహాలక్ష్మిదేవిగా కనకదుర్గమ్మ

తెనాలిరూరల్: మండలంలోని కఠెవరం గ్రామ బీసీ కాలనీలో గల దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మ కొల్హాపూర్ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.



వైభవంగా బండ్లమ్మ కొలుపులు

పిట్టలవానిపాలెం: మండలంలోని గోకరాజునల్లి బోయినవారిపాలెం గ్రామంలో బండ్లమ్మ కొలుపులు వైభవంగా నిర్వహించారు. మహిళలు నీరు వారబోసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ధనలక్ష్మి అలంకారంలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: శ్రావణమాసం మొదటి శుక్రవారం బండ్లమ్మను ధనలక్ష్మిగా అలంకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఇద్దరు ఐఆర్ఎస్ అధికారుల బాధ్యతల స్వీకారం

లక్ష్మీపురం: కేంద్ర జీఎస్టీ శాఖకు చెందిన ఇద్దరు అడిషనల్ కమిషనర్లు గుంటూరులో ఒకేరోజు నూతనంగా బాధ్యతలు చేపట్టారు. గుంటూరు రింగురోడ్డు లోని జీఎస్టీ కస్టమ్స్ అప్పీల్స్ కమిషనరేట్ అడిషనల్ కమిషనర్‌గా నూతలపాటి సౌమ్య శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించగా, గుంటూరు కన్నవారితోట జీఎస్టీ ప్రధాన కార్యాలయ అడిషనల్ కమిషనర్‌గా ఎస్.మధుసూదనరెడ్డి మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. నూతలపాటి సౌమ్య విజయవాడలోని కస్టమ్స్ హెడ్ క్వార్టర్స్ నుంచి బదిలీపై గుంటూరుకు రాగా, మధుసూదనరెడ్డి అప్పీల్స్ కమిషనరేట్ (గుంటూరు) నుంచి జి.ఎస్.టి కమిషనరేట్ (గుంటూరు)కు రొటేషన్‌పై వచ్చారు.

దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి



చిలకలూరిపేట: వివిధ కారణాలతో చదువు మధ్యలో నిలిపివేసిన వారు దూర విద్యను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యావంతులుగా ఎదగాలని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం స్టేట్ కో ఆర్డినేటర్ షేక్ అక్బర్ అలి చెప్పారు. మండల విద్యావనరుల కేంద్రంలో దూర విద్య పదోతరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాల వయసు నిండి ఉండాలని, ఇంటర్‌లో చేరేందుకు 15 సంవత్సరాల నిండి ఉండాలని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27లోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. విద్యాపీఠం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాపీఠం డీసీ షేక్ హుస్సేన్, ఎంఈఓ కె.లక్ష్మి, ఎంఈఓ–2 వీవీఎస్ రత్నకళ, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ హెచ్‌ఎం ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, మోడరన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

18న పవర్ లిఫ్టింగ్ పోటీలు

మంగళగిరి: గుంటూరు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ జిల్లా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్(మెన్,ఉమెన్) క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ 2024 పోటీలు తెనాలిలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సాయి రేవతి, క్విజ్ జిమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటలకు బాడీ వేయింగ్ ప్రారంభమవుతుందని, పోటీలలో పాల్గొనే పవర్ లిఫ్టర్స్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. పోటీలలో విజయం సాధించిన వారు వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

యార్డులో 33,615 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 28,881 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,615 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,200 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,568 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 256 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1460 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 565 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 245 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 415 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2140 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

రెడ్‌బుక్ ఉన్మాదంపై

సామాజిక సమరభేరి

- అంబేడ్కర్ స్మృతి వనంపై దాడి దారుణం
- పచ్చమూకల చర్య క్షమించరాని నేరం
- చంద్రబాబు, లోకేష్ ప్రోద్బలంతోనే దుశ్చర్య
- వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం

విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంలోని సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకం ధ్వంసం చేయడంపై జిల్లావ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజాస్వామికవాదులు ఈ దుశ్చర్యను ఖండిస్తున్నారు. దేశం గర్వించేలా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ స్మృతివనం శిలాఫలకంపై మాజీ సీఎం పేరును తొలగించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఊరూవాడా అంబేడ్కర్ విగ్రహాల వద్ద పోరుబావుటా రెపరెపలాడుతోంది. సామాజిక సమరభేరి మోగుతోంది.

అద్దంకి: విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకం ధ్వంసం పచ్చ మూకల దుశ్చర్యేనని, ఇది అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. శిలాఫలకంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తొలగింపును నిరసిస్తూ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం హనిమిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఘటనను ఖండించారు. చంద్రబాబు, లోకేశ్ ప్రోద్బలంతోనే పచ్చమూకలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. లైట్లు ఆర్పేసి ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూశారని మండిపడ్డారు. ఒక వైపు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు ఏకంగా రాజ్యాంగ నిర్మాత సాక్షిగా ఆయన విగ్రహంపైనే పచ్చ మూకలు దాడి చేయడానికి ప్రయత్నించడం, అక్షరాలను ధ్వంసం చేయడం హేయమన్నారు. ఇది యావత్ దళితులపై చేసిన దాడిగానే భావించాలన్నారు. ఈఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. దీనిపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దళిత బడుగు బలహీన వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వారికి మేలు చేస్తామని చెప్పి కీడు చేసేలా ప్రవర్తిస్తోందని దుయ్యబట్టారు.

చిత్తశుద్ధి ఉంటే విచారణ చేయించాలి..

కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు డిమాండ్ చేశారు. దీనిని అంబేడ్కర్‌కు జరిగిన అవమానంగానే భావిస్తున్నామని, దళితులు కూటమి ప్రభుత్వాన్ని క్షమించరని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కావూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి ఈవూరి గణేష్, పార్టీ నాయకులు

దుండగులను కఠినంగా శిక్షించాలి :ఈవూరు గణేష్

చెరుకుపల్లి: అంబేడ్కర్ స్మృతి వనంపై దుండగుల దాడి దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కావూరు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహాన్ని గణేష్‌తోపాటు మండలంలోని పలువురు వైసీపీ నాయకులు అంబేడ్కర్ యూత్ పాలతో శుద్ధి చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విధ్వంస కాండకు తెగబడుతోందని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ స్మృతివనంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు తొలగించడం దారుణమని పేర్కొన్నారు. దీనిని అంబేడ్కర్ వాదులు జీర్ణించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే ప్రజాఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. శనివారం సాయంత్రం 7 గంటలకు చెరుకుపల్లి ఖాదర్‌ఖాన్ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుత క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరుంబాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, తురిమెళ్ళ శ్రీధర్, కర్రా ప్రతాప్, రాజశేఖర్, గుడుమాటి సాగర్, సుధీర్, గుడుమాటి ఇస్సాకు, తురిమెళ్ళ మోషే, కావూరు అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి

అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం



వేమూరు: విజయవాడ నగరం మధ్యలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనంపై దుండుగుల దాడిని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఖండించారు. 1930 ఆగస్టు 9 న దళిత ఉద్ధరణ సమావేశం ప్రారంభించిన రోజే ఇలాంటి దుశ్చర్య జరగడం బాధాకరమని పేర్కొన్నారు. కూటమి నాయకుల అఘాయిత్యాలను ప్రజలను గమనిస్తున్నారని హెచ్చరించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల జోలికొస్తే దళితులు చూస్తూ ఊరుకోబోరని స్పష్టం చేశారు. వేమూరు నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేయాలని అశోక్‌బాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, లోకేశ్ ప్రమేయంతోనే అంబేడ్కర్ స్మృతివనంపై దాడి జరిగిందని దుయ్యబట్టారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

కలెక్టర్ వెంకట మురళి



గిరిజన నేతలకు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి

బాపట్ల: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. తొలుత బాపట్ల పట్టణంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో కలిసి జ్యోతి వెలిగించారు. ఏకలవ్యుడు చెంచులక్ష్మీ, అంబేడ్కర్, సేవాలాల్ మహారాజ్, వెన్నెల గంటి రాఘవయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఆదివాసీలలో సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనకు 40 ఏళ్లలోపు వారికి కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. శాసనమండలిలో చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గిరిజనుల విద్య, ఉద్యోగ అవకాశాలకు పెద్దపీట వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మరాజు, ఎం.ఎం.కొండయ్య, జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. సత్తిబాబు, ఆర్డీఓ జి.రవీందర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి రాజా దిబోరా, గిరిజన నాయకులు మోహన్ కుమార్ ధర్మ, రాఘవయ్య, డి.బ్రహ్మం, శివ శంకర ప్రసాద్, డి.రాము, ఎస్సీ నాయకులు చారువాక తదితరులు పాల్గొన్నారు.

వరద 'కట్ట'డి అయ్యేనా!

కరకట్ట భద్రత ప్రశ్నార్థకం

- కృష్ణానదికి పోటెత్తుతున్న వరద ఉధృతి
- ఆరు లక్షల క్యూసెక్కులు దాటితే గండమే
- పలుచోట్ల బలహీనంగా కరకట్ట
- కరకట్టకు పదుల సంఖ్యలో అక్రమంగా పైప్‌లైన్లు
- 2009లో ఓలేరు వద్ద పడిన గండి

రేపల్లె రూరల్: కృష్ణానది కరకట్ట భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. ఓలేరు నుంచి లంకెవానిదిబ్బ వరకు 35 కిలోమీటర్ల మేర ఉన్న కరకట్ట పలుచోట్ల బలహీనంగా ఉంది. ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. వరద ఉధృతి ఆరు లక్షల క్యూసెక్కులు దాటితే ముప్పు తప్పదని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ పైప్‌లైన్ల వల్లే..

నిబంధనల ప్రకారం కరకట్టకు 500 మీటర్ల దూరం లోపు ఎటువంటి చెరువుల తవ్వకాలూ జరపకూడదు. కానీ పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టకు ఆనుకొని సుమారు రెండు వేల ఎకరాలకుపైగా భూములను చెరువులుగా తవ్వి పలువురు ఆక్వా సాగు చేస్తున్నారు. చెరువులకు నీరు అందించడానికి పక్కనే ఉన్న బ్యాంక్ కెనాల్ నుంచి కరకట్టను తవ్వి అక్రమంగా పైపులు ఏర్పాటు చేశారు. దీనివల్ల కట్ట బలహీనపడి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వరద ప్రవాహం అధికమైతే అడ్డగోలుగా ఏర్పాటు చేసిన పైపుల వద్ద లీకులు ఏర్పడి కట్ట కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. గతంలో ఓలేరు వద్ద గండి పడిన సందర్భంలో లీకేజీ వద్ద నుంచే కట్ట కోతకు గురై కృష్ణమ్మ రేపల్లె పట్టణాన్ని ముంచెత్తింది. వరద ప్రవాహం ఆరు లక్షల క్యూసెక్కులు దాటితే బలహీనంగా ఉన్న కట్టకు గండ్లు పడి కోతకు గురయ్యే ప్రమాదం ఉంది.



విశ్వేశ్వరం సమీపంలో అక్రమంగా బ్యాంక్ కెనాల్ నుంచి కరకట్ట పక్కన ఉన్న చెరువులకు ఏర్పాటు చేసిన పైపులైన్‌లు



2009లో ఓలేరు వద్ద కరకట్టకు పడిన గండి (ఫైల్)

2009లో ఓలేరు వద్ద కరకట్టకు గండి

2009 అక్టోబర్ 5న రాత్రి ఓలేరు పల్లెపాలెం వద్ద కట్టకు గండి పడటంతో కృష్ణమ్మ పరిసర గ్రామాలతోపాటు రేపల్లె పట్టణంపై విరుచుకుపడింది. దీంతో వేలాది ఎకరాల పంట నీట మునగటంతోపాటు పట్టణంలో నాలుగు అడుగులకుపైగా నీరు చేరింది. ప్రధాన కూడళ్లలోని ప్రభుత్వ కార్యాలయాలూ నీట మునిగాయి. ఎన్నో ఇళ్లు నేలకూలాయి.

గత 120 ఏళ్లలో భారీగా సంభవించిన వరదలు ఇలా..

తేదీ	వరద ఉధృతి (క్యూసెక్కులు లక్షల్లో)
అక్టోబర్ 7, 1903	10.68
ఆగస్టు 11, 1914,	9.49
నవంబర్ 2, 1917	9.55
సెప్టెంబర్ 24, 1949	9.25
అక్టోబర్ 2, 1964	9.88
అక్టోబర్ 17, 1998	9.32
అక్టోబర్ 5, 6, 2009	10.94
అక్టోబర్ 16, 2020	7.39

ఆచూకీలేని ఆరిఫ్ హంతకులు

- బాపట్ల నుంచి ఇతర రాష్ట్రాలకు జంప్
- అన్ని ఫోన్లూ స్విచ్ఛాఫ్
- పది బృందాలు గాలిస్తున్నా దొరకని వైనం

చీరాల: ముస్లిం యువకుడు, డిగ్రీ విద్యార్థి ఈపురుపాలేనికి చెందిన సయ్యద్ ఆరిఫ్ (18)ను అత్యంత కిరాతకంగా చంపిన నిందితులు ఎవరనేది పోలీసులు, బాధితులకు, చీరాల ప్రజలందరికీ తెలిసినా వారి ఆచూకీ చిక్కడం లేదు. హత్య జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు నిందితులను పట్టుకోవడంలో పోలీసులు పురోగతి సాధించలేకపోయారు. రాష్ట్ర, జిల్లా పోలీసు యంత్రాంగం ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నామని చెబుతున్నా.. నిందితులు తప్పించుకు తిరుగుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుని పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. నిందితుల ఫోన్లను పోలీసులు ట్రాక్ చేస్తున్నా లోకేషన్ ట్రేస్ కావట్లేదని సమాచారం.

భారీగా నగదుతో జంప్

హత్య చేసిన రోజు నిందితులందరూ బాపట్లలోని తమ నివాసానికి వెళ్లి భారీగా నగదు తీసుకుని ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి కారులో పరారయ్యారని తెలుస్తోంది. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే పోలీసులు బాపట్లలోని హంతకుల నివాసానికి వెళ్లారు. అయితే అప్పటికి కొద్దిసేపు ముందే నిందితులు పరారైనట్టు గుర్తించారు. పది బృందాలు హంతకుల కోసం గాలిస్తున్నాయి. నిందితులంతా మాజీ నేరస్తులు. పలు కేసుల్లో ఉనానరు. పలుమార్లు జైలు శిక్షలు అనుభవించడం, పలువురు అంతర్రాష్ట్ర నేరస్తులతో సంబంధాలు ఉండటంతో ఒకేచోట ఉండకుండా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నట్లు సమాచారం.

నిందితుల బంధువుల విచారణ

నిందితుల బంధువులను స్టేషన్లకు తీసుకువచ్చి విచారణ చేస్తున్నా.. ఫలితం లేకపోతోంది. వారి గురించి సమాచారం దొరకడం లేదు. కొత్తగా వచ్చిన ఎస్పీ తుషార్‌డూడీ ఆరిఫ్ హత్యపై ప్రత్యేక దృష్టి సారించారు. సాంకేతిక నిఘా పద్ధతులతో నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

ముందస్తు బెయిల్ కోసమా ?లొంగుబాటా ?

ఈ హత్యలోని నిందితుల్లో ఒకరు లాయర్. అతనికి హైకోర్టు న్యాయవాదులతో సంబంధాలు మెరుగ్గా ఉన్నాయని సమాచారం. గతంలో హత్యలు, హత్యాయత్నాలు, కోడిపందేలు, పలు వివాదాల్లో ముద్దాయిలుగా ఉన్న ఈ నేరస్తులు ఆరిఫ్ హత్య కేసు నుంచి సులువుగా బయటపడేందుకు తీవ్రంగా యత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ముందస్తు బెయిల్ కోసం యత్నిస్తున్నట్టు సమాచారం. ఒక వేళ బెయిల్ రాకపోతే కోర్టులో లొంగిపోయేందుకు యత్నిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసులకు చిక్కితే హత్య కేసులో శిక్షపడే అవకాశం ఉందని, సాంకేతిక సాక్ష్యాలు లేకుండా కోర్టులో లొంగిపోయేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. ఏదేమైనా పోలీసుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిందితులను త్వరగా అరెస్టు చేసి వాటికి సమాధానం చెప్పాల్సి ఉంది.

పచ్చ ఖాకీల కోసం పాకులాట

పోలీసు పోస్టింగులకు పైరవీలు

- నేతల సిఫార్సులతో పలువురు సీఐ, ఎస్ఐల నియామకం
- బదిలీల్లో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ప్రచారం
- నేతల సామాజిక వర్గాలకు ప్రాధాన్యం
- జిల్లాలో వీఆర్‌కు ఆరుగురు సీఐలు... అంతే స్థాయిలోఎస్ఐలు
- పాలకుల తీరుపై పోలీసు అధికారుల్లో ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో దొంగతనాలు, దోపిడీలు, పేకాట, కోడిపందేలు, గంజాయి, గోవా మద్యం.. మొదలు పలు రకాల అక్రమ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వాటి ప్రభావంతో హత్యలు, అత్యాచారాలు అమాయకుల ప్రాణాలను బలికొంటున్నాయి. పెచ్చరిల్లిన నేరాలు అదుపులోకి రాలేదు. తద్వారా శాంతి భద్రతలు అదుపు తప్పాయి. అయినా సరే మాకు కావాల్సింది వాటిని అదుపు చేసే సమర్థ అధికారులు కాదు. మేం చెప్పినట్లు వినే అధికారులు, మా కులపోళ్లు. పచ్చ చొక్కా తొడుకున్న అధికారులు.. ఇన్ని అర్హతలు ఉన్నా పోస్టింగులకు డబ్బు కూడా చెల్లించాలి. జిల్లాలో డీఎస్పీ, సీఐ, ఎస్ పోస్టింగుల కోసం ప్రజాప్రతినిధులు పెడుతున్న నిబంధనలు ఇవి. తాజా బదిలీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

ఆ సామాజిక వర్గం కోసం జల్లెడ ...

జిల్లాకు చెందిన ఒక మంత్రి రెండు సామాజిక వర్గాల వారికే పోస్టింగుల్లో ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు బదిలీల విషయంలో అన్ని నియోజకవర్గాల్లో వేలు పెడుతున్నట్లు అధికార పార్టీలో ప్రచారం జరుగుతోంది. మరొక మంత్రి వీలయినంత వరకు తన సామాజిక వర్గం వారే కావాలని జల్లెడ పట్టి మరీ పోస్టింగులు ఇస్తున్నారు. ఇక పర్చూరు నేత మాత్రం పట్టుబట్టి మరీ తన సామాజిక వర్గం వారినే వెతికి తెచ్చుకుంటున్నారు. చీరాల నేత బీసీ సామాజివర్గం అధికారులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. బాపట్ల ప్రజాప్రతినిధికి తన సామాజికవర్గ బలం అధికారులు తక్కువగా ఉండటంతో చంద్రబాబు సామాజిక వర్గంతోపాటు పవన్‌కళ్యాణ్ సామాజిక వర్గం అధికారులను తెచ్చుకోక తప్పడం లేదు. వేమూరు నియోజక వర్గంలో ఎస్సీతోపాటు ఇతర ఒకటి రెండు సామాజిక వర్గాల అధికారులకు పోస్టింగులు ఇస్తున్నారు.

రూ. లక్షల్లో వసూలు...

పోలీసు బదిలీల్లో పెద్ద ఎత్తున పైరవీలు నడిచాయి. పర్చూరు, బాపట్ల, అద్దంకి ప్రాంతాల్లో సీఐ పోస్టింగ్‌కు రూ. 20 నుంచి రూ. 30 లక్షల, ఎస్సై పోస్టింగులకు రూ. 5 నుంచి రూ.10 లక్షల వరకు నేతలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో పోస్టింగులు ఇప్పిస్తామంటూ కొందరు నేతలు స్థానిక ప్రజాప్రతినిధులను కాదని మంత్రులు, సీఎం, లోకేష్ పేషీ నుంచి కథ నడిపించినట్లు సమాచారం. గతంలో డీజీపీ హోదాలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఒక అధికారి ద్వారా కొందరు పైరవీకారులు బాపట్లతోపాటు చీరాల ,ఇతర ప్రాంతాల్లో పోస్టింగులు ఇప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల డీఎస్పీ గా ఉన్న మురళీకృష్ణను కొనసాగించాలని అధికారపార్టీ నేత పోలీసు ఉన్నతాధికారులకు లేఖ ఇచ్చారు. తీరా చూస్తే చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన రామాంజనేయులును బాపట్ల డీఎస్పీగా వేశారు. దీంతో ఖంగుతిన్న బాపట్ల నేత రాజధానికి పరుగులు పెట్టారు. చీరాలలో కొన్ని పోస్టింగుల విషయంలోనూ స్థానికులను కాదని కొందరు అధికారపార్టీ పైరవీకారులు ఒక మంత్రి మద్దతుతో పెద్ద ఎత్తున ముడుపులు పుచ్చుకొని పోస్టింగులకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఈ విషయాన్ని కొందరు ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే సీఎంఓలో ఉన్న కమిటీ ఎంపిక అంటూ అధిష్టానం దాట వేస్తోంది.

సమర్థతకు తిలోదకాలు...

తాజా బదిలీలు చూస్తే ఉన్నతాధికారులు సమర్థతకు తిలోదకాలు ఇచ్చినట్లు కనపడుతోంది. జిల్లాలో పనిచేసిన ఆరుగురు సీఐలు, ఆరుగురు ఎస్సైలను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. చీరాల వన్‌టౌన్‌లో సీఐగా పనిచేసిన శేషగిరిరావు, రేపల్లె టౌన్‌లో పనిచేసిన నజీర్‌బేగ్, మార్టూరు సీఐ రాజశేఖరరెడ్డి, సంతమాగులూరు సీఐ నరసింహారావు, బాపట్ల టౌన్ శ్రీనివాసులు, రూరల్ శ్రీహరిలతోపాటు నిజాంపట్నం ఎస్ఐ, శ్రీనివాసరావు, భట్టిప్రోలు కె.శ్రీనివాసరావు, బల్లికురవ రవిశంకర్‌రెడ్డి, ఇంకొల్లు మల్లిఖార్జునరావు, ఈపూరుపాలెం శివకుమార్‌లను వీఆర్‌కు పంపారు. ఎటువంటి తప్పు చేయక పోయినా ప్రభుత్వం కక్ష సాధింపుతో వారిని వీఆర్‌కు పంపడం పట్ల పోలీసు వర్గాల్లోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక వారి స్థానంలో నేతలు చెప్పిన వారికి పోస్టింగులు ఇచ్చినట్లు తెలుస్తోంది. పైగా కొన్ని సామాజికవర్గాలకు, ప్రధానంగా ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి పోస్టింగుల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ప్రచారం ఉంది.

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం



మేడికొండ సునీల్

చినగంజాం: విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి ప్రయత్నించడం హేయమని పీవీ రావు మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేడికొండ సునీల్ శుక్రవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. మ్యూజియం ప్రాంతంలోనికి కొందరు దుండగులు ప్రవేశించి విగ్రహ నిర్మాణంలో భాగమైన దిమ్మెపై నిర్మించిన శిలాఫలకాలను, పేర్లను తొలగించే ప్రయత్నం చేస్తూ విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు. అలాంటి దుశ్చర్యకు పాల్పడిన దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. గతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని చంద్రబాబు మోసం చేశారన్నారు. మాజీ సీఎం జగన్ మాత్రం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వారి ఆత్మగౌరవాన్ని రాష్ట్ర నడిబొడ్డున నిలబెట్టారని అన్నారు. ఈ ఘటనను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యుడు ఖండిస్తూ ప్రకటన చేయాలని పేర్కొన్నారు. లేకుంటే పీవీ రావు మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అనంతపురం, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం

అనంతపురం తొలి ఇన్నింగ్స్ 324 ఆలౌట్

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం అనంతపురం, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 324 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని భార్గవరాజు 110 బంతుల్లో 86 పరుగులు, ఎస్.మనోజ్ 47 బంతుల్లో 69 పరుగులు సాధించారు. ప్రకాశం బౌలర్ ఆర్.ప్రణుదీప్‌కు నాలుగు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి ఆరు పరుగులు సాధించింది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు. శనివారం రెండవ రోజు ఆట కొనసాగనుంది.

ఆక్వా సాగులో జీవ వైవిధ్యాన్ని పెంచాలి

జాతీయ ఫుడ్, అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ కొండ చవ్య



ఆక్వా చెరువును పరిశీలిస్తున్న జాతీయ బృందం సభ్యులు

బాపట్ల టౌన్: ఆక్వా సాగులో కార్బన్ ఉద్గారాలను 30 శాతం తగ్గించి జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని జాతీయ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ కొండ చవ్య తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ చైల్డ్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా ఉత్పత్తుల్లో కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు రూ. 107 కోట్లను ఆంధ్ర ప్రదేశ్‌కు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని బాపట్ల, ఏలూరు, కృష్ణా, కాకినాడ జిల్లాల్లో పర్యటించి, ఆక్వాకల్చర్ తీరుతెన్నులు పరిశీలించేందుకు శుక్రవారం జాతీయబృందం బాపట్లకు చేరుకుంది. ఈ బృందం 12వ తేదీ వరకు రాష్ట్రంలో పర్యటించనుంది. బాపట్ల మండలంలోని ఓడరేవు తీరం సమీపంలో ఉన్న గాయత్రి బయో మెరైన్ హేచరీ, ఎంపెడా ఎలీసా ల్యాబ్, రాయల్ మెరైన్ ప్రాసెసింగ్ ప్లాంట్, బయోఫ్లాక్ వ్యవస్థలను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో జాతీయ జీవ వైవిధ్య నిపుణులు సీమా భట్, సాంకేతిక నిపుణులు మురళీధర్, ఆక్వాకల్చర్ స్పెషలిస్ట్ విష్ణుభట్, పర్యావరణ ప్రతినిధి నీనాకోషి, మత్స్యశాఖ జేడీఏ డాక్టర్ పి. సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న చాంద్ బాషా

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే 1.60 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియకు ముందు ప్రతి శాఖ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్ బాష మాట్లాడుతూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని, వాళ్లకు పదోన్నతుల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. వేతన సంరక్షణ విషయంలో కూడా మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రేడ్ –3 ఏఎన్‌ఎంలను వారి మాతృశాఖకు మార్పు చేస్తే వారందరినీ మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)గా పరిగణించి అన్ని అలవెన్సులు ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేయాలని తెలిపారు. మొబైల్ యాప్‌లను తొలగించి వారికి త్రీవమైన ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈనెల 11న జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్య నారాయణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, నగరశాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి సుమిత్రా దేవి, సహాధ్యక్షురాలు హేమలత, నగరశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆషా సజిని, సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగులు కోటా సాహెబ్, రాధాకృష్ణ, రత్తయ్య, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌరసరఫరాల అధికారులతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక మహబూబ్‌నగర్ కాలనీలోని 30వ నంబరు, రజక రామాలయం వెనుకనున్న 2వ నంబరు రేషన్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రిజిస్టర్లలో లెక్కలకు, దుకాణంలో సరుకు నిల్వలకు మధ్య వ్యత్యాసాలున్నాయా అన్నది సరి చూశారు. ఈ సందర్భంగా సీఎస్ డీటీ పద్మజ మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించామని, ఎలాంటి వ్యత్యాసాలు లేవని తెలిపారు. అయితే గతంలో ఎప్పుడు విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వచ్చినా సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు ఉండేవారు. కానీ ఇక్కడ మాత్రం హెడ్‌కానిస్టేబుల్ స్థాయి అధికారి తనిఖీలు చేయడం గమనార్హం. సీఐ సెంటరులో ఉన్నారని సదరు విజిలెన్స్ అధికారులు చెప్పడం కొసమెరుపు.

బాలికను మోసగించిన నిందితుడికి 3 నెలల జైలు

చిలకలూరిపేటటౌన్: బాలికను ప్రేమించానంటూ మోసగించిన యువకుడికి న్యాయస్థానం మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను పట్టణంలోని ఆది ఆంధ్ర కాలనీకి చెందిన బండారు రవికుమార్ 2019లో గుంటూరుకు తీసుకెళ్లాడు. మాయమాటలు చెప్పిన విషయాన్ని గ్రహించిన బాలిక వాష్‌రూంకు వెళ్లొస్తానంటూ తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారొచ్చి కుమార్తెను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులను ఆశ్రయించడంతో అప్పటి ఎస్ఐ జి అనిల్‌కుమార్ మోసగించిన రవికుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అప్పట్లో కోర్టుకు చేరిన ఈ కేసును ఏపీపీ సుకుమార్ వాదనల అనంతరం గుంటూరులోని 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టు జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి నవ్యశ్రీ తీర్పునిచ్చారు.

నేడు విద్యా ప్రదాత కుప్పస్వామి విగ్రహావిష్కరణ



జాగర్లమూడి కుప్పస్వామి చౌదరి (ఫైల్)

కారంచేడు: విద్యాదాత, కవి, రాజకీయ నేత, సంఘ సేవకుడిగా జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన భూస్వామ్య కుటుంబంలో జన్మించినా పేదలు, రైతుల సమస్యలపై అవగాహన పెంచుకున్నారు. మండల కేంద్రమైన కారంచేడులో 1892 ఆగస్టు 15వ తేదీన లక్ష్మయ్యనాయుడు, రంగమ్మలకు జన్మించారు. ఆంగ్ల భాష ఆవశ్యకతను గుర్తించి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందించేలా కృషి చేశారు. అనంతరం జస్టిస్ పార్టీలో చేరినా పార్టీ సిద్ధాంతాలను పక్కన పెట్టి పేదలకు విద్యను అందించేందుకు ప్రాధాన్యమిచ్చారు. 1920లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు గుంటూరు జిల్లా నుంచి జస్టిస్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు. 1936 వరకు వరుసగా విజయాలు సాధించారు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, కుమారులు చంద్రమౌళిబాబు, మదన్‌మోహన్ చౌదరి, లక్ష్మయ్య చౌదరిలు ఉన్నారు. 1960 డిసెంబర్ 14న ఆయన కన్నుమూశారు. అనంతరం ఆయన పేరిట గుంటూరులో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి (జేకేసీ) కాలేజీ స్థాపించబడింది. ఇటీవల ఆయన కాంస్య విగ్రహాన్ని కారంచేడు చినవంతెన సెంటర్‌లో కుటుంబసభ్యులు ఏర్పాటు చేశారు. శనివారం ఈ విగ్రహావిష్కరణకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

రేంజ్‌లో మరో 10 మంది సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో పది మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు -	ప్రస్తుతం -	బదిలీ
ఎం.రామనాయక్	-పాములు సర్కిల్, ప్రకాశం జిల్లా	-వట్టిచెరుకూరు యూపీఎస్,గుంటూరు జిల్లా
ఎన్.కిశోర్‌బాబు	- సీఐడీ, ఏపీ	-గుడూరు రూరల్ సర్కిల్, తిరుపతి
జి.సంగమేశ్వరరావు	- వెంకటగిరి సర్కిల్, తిరుపతి	-నాయుడుపేట రూరల్ సర్కిల్, తిరుపతి జిల్లా
ఎ.వెంకటరమణ	-ఎస్సీఎస్టీ సెల్, ప్రకాశం	-వెంకటగిరి సర్కిల్, తిరుపతి జిల్లా
జి.ఎల్.శ్రీనివాసరావు	- ఏసీబీ, ఏపీ	-మార్టూరు సర్కిల్, బాపట్ల జిల్లా
వై.వి. రమణయ్య	-రేంజ్ వీఆర్, గుంటూరు	-ఇంకొల్లు సర్కిల్, బాపట్ల జిల్లా
వై.పాండురంగారావు	-రేంజ్ వీఆర్, గుంటూరు	-ట్రాఫిక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా
కామరాజుగడ్డ సాంబశివరావు	-సీసీఎస్, ఏసీపీఎస్ నెల్లూరు	-నెల్లూరు ఆరో టౌన్ పీఎస్
మద్ది శ్రీనివాసరావు	-సీఐడీ ఏపీ	-ఎస్పీఎస్ నెల్లూరు త్రీ టౌన్ పీఎస్
బి.హరికృష్ణ	-రేంజ్ వీఆర్	-బాపట్ల రూరల్ సర్కిల్, బాపట్ల

జిల్లాలో మరో 12 మంది ఎస్ఐల బదిలీ

బాపట్ల టౌన్: జిల్లాలో 12 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు మరో ఆరుగుర్ని వీఆర్‌కు పంపారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి. అనిల్‌కుమార్	చందోలు పీఎస్	చెరుకుపల్లి
కె. తిరుపతిరావు	జె పంగులూరు	నిజాంపట్నం
ఎం. శివయ్య	కొరిశపాడు	భట్టిప్రోలు
జి.వి.చౌదరి	యద్దనపూడి	బల్లికురవ
ఎస్‌కె మహ్మద్‌రఫీ	చుండూరు	మేదరమెట్ల
వై. సురేష్	చెరుకుపల్లి	కొరిశపాడు
ఎస్. రమేష్	పర్చూరు	చిన్నగంజాం
జి. సురేష్	వేటపాలెం	ఇంకొల్లు
పి. సురేష్	సంతమాగులూరు	పర్చూరు
డి. రత్నకుమారి	అద్దంకి	యద్దనపూడి
ఎ. చంద్రశేఖర్	మేదరమెట్ల	ఈపూరుపాలెం
ఎం. వెంకటేశ్వర్లు	చీరాలటౌన్	వేటపాలెం

వీఆర్‌కు ఆరుగురు ఎస్ఐలు

జిల్లాలో ఆరుగురు ఎస్ఐలను ఆయా స్టేషన్ల నుంచి వీఆర్‌కు పంపారు. ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా వారిని ఆదేశించారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్టేషన్
జి. శ్రీనివాసరావు	నిజాంపట్నం
కె. శ్రీనివాసరావు	భట్టిప్రోలు
వి.ఆర్. శంకర్‌రెడ్డి	బల్లికురవ
ఎం. శ్రీనివాసరావు	చిన్నగంజాం
ఎస్. మల్లికార్జునరావు	ఇంకొల్లు
ఎం.వి.శివకుమార్	ఈపూరుపాలెం

నాగరాజును అంతం చేయడానికే కిడ్నాప్

- ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యం
- నిందితులను మీడియాకు చూపకుండా పోలీసుల జాగ్రత్తలు
- బాధితుడు మీడియాతో మాట్లాడకుండా పోలీసుల ఆంక్షలు



వినుకొండలో చికిత్స కోసం నాగరాజును తరలిస్తున్న పోలీసులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో సంచలనం కల్గించిన ఒంటేరు నాగరాజు కిడ్నాప్ వ్యవహారం ఎట్టకేలకు సుఖాంతమైంది. గురువారం వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం సమీపంతో దుర్గి మండలం జంగమహేశ్వరపాడు గ్రామానికి చెందిన ఎనిమిది మంది నాగరాజును కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. కిడ్నాప్ సమాచారం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా ఫోన్ సిగ్నల్ ఆధారంగా బొల్లాపల్లి మండలం మర్రిపాలెం వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని నాగరాజును కాపాడారు. రాత్రి 10 గంటల తరువాత నాగరాజును వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆరుగురు అరెస్ట్

ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు. కిడ్నాప్‌లో పాలుపంచుకున్న టంగుటూరి మల్లికార్జున, గోపి, కొండలు, ఆరెద్దుల మణి, ఆవుల జల్లయ్య, కంచర్ల రామాంజనేయులు, పాశం ఏడుకొండలును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కిడ్నాప్ వ్యవహారంలో ఎనిమిది మంది ఉన్నారని నాగరాజు కుటుంబసభ్యులు ఆరోపిస్తుండగా పోలీసులు మాత్రం ఏడుగురు నిందితులు ఉన్నారని అందులో ఒకరు పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు.

హత్య చేసేందుకే...

కిడ్నాప్‌కు గురైన నాగారాజును అంతమొందించేందుకే కిడ్నాప్ చేశారని అంటున్నారు. నాగరాజును స్వగ్రామం తీసుకెళ్లి అక్కడే హత్యచేయాలనే ఉద్దేశ్యంతోనే సుమారు 40 కిలోమీటర్లు బొలెరో వాహనంలో తీసుకెళ్లారు. తమ గ్రామంలోనే హత్య చేసి అందరినీ భయభ్రాంతులకు గురిచేయాలనే నిందితుల ఉద్దేశంగా భావిస్తున్నారు.

రహస్యంగా నిందితుల తరలింపు

నిందితులను రహస్యంగా నర్సరావుపేట ఎస్పీ వద్దకు తరలించినట్లు పోలీసులు చెబుతున్నారు. బండ్లమోటు పోలీస్టేషను పరిధిలో కేసు నమోదుచేసి మీడియాకంట పడకుండా జాగ్రత్తపడ్డారు. శాంతిభద్రతల పేరుతో మీడియాకు సమాచారం ఇవ్వలేదు. నాగరాజును కూడా మీడియాతో మాట్లానివ్వకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎట్టకేలకు హత్య జరగకుండా పోలీసులు తీసుకున్న చర్యల పట్ల ప్రజలు బాధితుని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

- సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు
- నకరికల్లులోని విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు: క్రయ, విక్రయాల్లో నిబంధనలు పాటించకున్నా... రైతులకు ఇబ్బంది కలిగేలా విత్తనదారులు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు హెచ్చరించారు. విత్తనమో రామచంద్రా అంటూ సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. స్థానిక విత్తనాల దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. విత్తనాల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. నకరికల్లు, కుంకలగుంట, చీమలమర్రి, రూపెనగుంట్ల గ్రామాల్లోని రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే మండల వ్యవసాయాధికారి 8331056952 నంబరును, సహాయ వ్యవసాయ సంచాలకులు 8331056947 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. సీజన్ ప్రారంభం కన్నా రూ.100 అధికంగా విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనలు అతిక్రమించి అధికధరలకు విక్రయించిన వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రశీదుల్లో రైతు సంతకాలు, అమ్మకందారు సంతకాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులు విధిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. విత్తనాల అమ్మకాలపై నిరంతం నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో ఒంటరి మహిళ హత్య

- నిందితుడు ఒడిశాకు చెందిన వలస కార్మికుడిగా గుర్తింపు
- పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు



నిందితుడు రాజు మాలిక్ (ఫైల్)



మృతదేహం వద్ద వివరాలు నమోదు చేస్తున్న రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్సై బలరామ్‌రెడ్డి

నాదెండ్ల: భర్తను కోల్పోయి ఒంటరిగా నివసిస్తున్న మహిళను అర్ధరాత్రి ఒడిశాకు చెందిన యువకుడు హత్య చేసిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ (45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈమె భర్త నాగూర్‌సాహెబ్ మూడు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. సొంతిల్లు లేకపోవటంతో స్థానిక పీర్లచావిడీలోని గదిలో నివసిస్తోంది. గ్రామానికి చెందిన గాజుల మీరయ్య గ్రామంలోని మిల్లుల్లో కూలీలను సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన రాజుమాలిక్ అనే వ్యక్తి మీరయ్య దగ్గర పనిచేస్తుంటాడు. రెండేళ్ల కిందట రాజుమాలిక్, అతని భార్య అతని అన్న నారాయణ మాలిక్, వదినతో కలిసి రాజీవ్‌గాంధీకాలనీలోని అద్దె ఇంట్లో నివాసం ఉన్నారు. ఇంటి అద్దె చెల్లించకపోవటంతో రాజుమాలిక్, అతని భార్యను ఇల్లు ఖాళీ చేయించారు. అదేసమయంలో అతని భార్య ఒడిశాలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో మేస్త్రీ మీరయ్య రాజుమాలిక్‌ను పీర్ల చావిడీలోని మరో గదిలో ఉండమని చెప్పటంతో అక్కడే నివసిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి రాజుమాలిక్ పక్క గదిలో నిద్రిస్తున్న షేక్ మస్తాన్‌బీ చేతులు, కాళ్లు కట్టేసి చీరతో గొంతునులిమి హత్య చేసి పరారయ్యాడు. స్థానికులతో సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ బి సుబ్బనాయుడు, ఎస్సై జె బలరామ్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. గుంటూరు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. మృతురాలు మస్తాన్‌బీ కుమార్తె జాన్‌బీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

లైంగికదాడి చేసి హత్య చేసినట్లు భావిస్తున్న పోలీసులు

ఒంటరిగా నివసిస్తున్న మస్తాన్‌బీని ఒడిశాకు చెందిన యువకుడు హత్య చేయటంతో స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమౌతోంది. కొద్దిరోజులుగా పీర్ల చావిడీ గదుల్లో నివాసం ఉంటున్న రాజుమాలిక్ మద్యం, గంజాయి వినియోగిస్తుండటంతో ఇది గుర్తించిన స్థానికులు అతన్ని అక్కడి నుంచి ఖాళీ చేయమని హెచ్చరించారు. అయితే గురువారం రాత్రి ఏం జరిగిందో తెలియదు కానీ పక్కగదిలోని మస్తాన్‌బీపై లైంగికదాడి చేసి ఆపై హత్య చేశాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు చేయనున్నారు. పరారీలో ఉన్న రాజుమాలిక్ ఫోటోను ఇన్‌స్టాగామ్‌లో పోలీసులు గుర్తించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

గుంటూరు జట్టుపై కృష్ణా ఆధిక్యం

మంగళగిరి: నగరంలోని అమరావతి టౌన్ షిప్‌లో గల ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న మల్టీ ఇంటర్ డిస్ట్రిక్ పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టుపై కృష్ణా జట్టు ఆధిక్యం సాధించింది. టాస్ గెలిసి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు 48.3 ఓవర్లలో 195 పరుగులు చేసింది. గుంటూరు జట్టు 103 పరుగులు చేసింది. కృష్ణా జట్టు బ్యాట్స్‌మేన్ విశాల్ 51 పరుగులు సాధించగా, గుంటూరు జట్టు బౌలర్ సిద్ధార్థ నాలుగు వికెట్లు తీసి రాణించాడు.